క్లుప్తంగా

చినసత్తార్ ట్రస్టు సేవలు విలువైనవి

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట: పఠాన్ చిన సత్తార్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు సేవలు విలువైనవని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని 1600 మంది నిరుపేద ముస్లింలకు ఒక్కొక్కరికీ 15 రకాల నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం వారి కుమారులు గత 32 సంవత్సరాలుగా పేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. పండుగకు పేదలను ఆదుకుంటునే ట్రస్టు తరుపున నిరుపేద విద్యార్థులకు ఉపకారవేతనాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పఠాన్ యాసుఫ్‌ఖాన్; పఠాన్ పెద్ద సుభాని, పఠాన్ యాసిన్, ముఫ్తి అనస్‌ఖాన్, వేటపాలెం సుభాని, ఆరాధ్యుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10న పీవో/ ఏపీవోలకు శిక్షణ

నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పీవో/ ఏపీవోలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం వాయిదాపడినట్లు ఏఈఆర్వో, తహసీల్దార్ డీవీబీ వరకుమార్ తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి లో ఎన్నికల విధులకు హాజరయ్యే పీవో/ ఏపీవోలకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా శిక్షణ ఇవ్వనున్నారు. 700 మందికి గాను పది గదుల్లో పది మంది ట్రైనర్లతో శిక్షణ యివ్వనున్నట్లు తెలిపారు.

సైన్స్ ప్రయోగ పోటీల్లో బొగ్గరం విద్యార్థుల ప్రతిభ



ఈపూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రయోగాల పోటీల్లో మండలంలోని బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు ప్రధానోపాధ్యాయులు సీహెచ్.వీరప్పయ్య శనివారం తెలిపారు. 9వ తరగతి చదువుతున్న బి.స్వాతి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందగా, పి.చెన్నకేశవ్ రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి గెలపొందాడని తెలిపారు. వీరికి జనవిజ్ఞాన వేదిక తరపున సర్టిఫికెట్స్, నగదు బహుమతులు, విలువైన పుస్తకాలు బహుమతిగా పంపినట్లు తెలిపారు. విద్యార్థులను పోటీలకు తీర్చిదిద్దిన సైన్స్ ఉపాధ్యాయినీ లక్ష్మీనర్సమ్మను విద్యాకమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఇఫ్తార్ విందు

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎంఎస్ గార్డెన్స్ ముస్లిం షాదీఖానాలో సాయంత్రం ఆరు గంటలకు ఇఫ్తార్ విందు, దువా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులందరూ ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది



సత్తెనపల్లి: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఏరియా వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ అన్నారు. పట్టణంలోని వేద నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు శనివారం నర్సింగ్ క్యాప్ బహూకరించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులతో ప్రభుత్వ వైద్యశాల హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ వృత్తి ప్రమాణం చేయించారు. అనంతరం జరిగిన సభకు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ మామిడి మాలతి అధ్యక్షత వహించారు. రాధ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పేదలకు సేవ చేసేందుకు ఈ వృత్తి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సత్తెనపల్లి ప్రాంతంలో నర్సింగ్ విద్యను ప్రవేశ పెట్టిన వేద విద్యా సంస్థల యజమాన్యాన్ని అభినందించారు. చదువు కన్నా క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం తల్లితండ్రుల సమక్షంలో విద్యార్థులకు క్యాప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ చింతాడ ప్రభావతి, అకాడమిక్ డైరెక్టర్ సూర్య ప్రకాష్, అధ్యాపకులు అనూష, సిందూష, పవిత్ర, ప్రియ, జ్యోతి, విజయ శాంతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అబద్ధాల బాబును నమ్మకండి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చాకలిగుంట తండా యువకులు



పార్టీలో చేరిన ముప్పాళ్ల గ్రామస్తులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పార్టీలో చేరిన చాకలిగుంట తండాకు చెందిన యువకులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొన్ని గ్రామాలకు చెందిన యువకులు, వ్యక్తులను అబద్ధపు మాటలతో మోసం చేసి తమ పార్టీలో చేరినట్లు ప్రకటించుకుంటున్నాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా రొంపిచర్ల మండలం చాకలిగుంట తండాకు చెందిన పలువురు యువకులకు ఆడుకునేందుకు రెండు ఎకరాల క్రీడాస్థలం, క్రికెట్ కిట్లు ఇస్తామని నమ్మబలికి తన కార్యాలయంకు పిలిచి పార్టీ కండువాలను కప్పి చేతిలో సమోసాలను పెట్టి వారు తమ పార్టీలోకి చేరినట్లుగా ప్రచారం చేసుకున్నాడన్నారు. అరవిందబాబు మాటలతో మోసపోయిన చాకలిగుంట తండాకు చెందిన పలువురు యువకులకు శనివారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి కండువాలను కప్పి మాట్లాడారు. అరవిందబాబు టీడీపీ వారికే కండువాలు వేసి పార్టీలో చేరారని ప్రకటించుకోవటం, నాలుగు కుటుంబాలు చేరితే 40 కుటుంబాలు చేరాయని ప్రచారం చేసుకోవటం చేస్తున్నాడన్నారు. పచ్చి అబద్ధాలపైనే అతను ఆధారపడ్డాడన్నారు. నలగార్లపాడు గ్రామంలో ఇంటి స్థలం ఇప్పిస్తానని ఎకరం రూ.50 లక్షలు ఉన్న భూమిని రెండు ఎకరాలు కొని ఇస్తానని మోసపు మాటలు చెప్పి కొంతమందిని పార్టీలో చేర్చినట్లు నాటకం ఆడాడన్నారు. తాము చాకలిగుంట తండాకు 50 ఎకరాల అటవీభూమిని ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు ఇచ్చామన్నారు. మరో 75 మందికి ఇంటిపట్టాలు, నాడు-నేడు కింద నాలుగు స్కూళ్లను అభివృద్ధి చేశామన్నారు. అరవిందబాబుకు ఏమీ తెలియదని, కనీస పరిజ్ఞానం కూడాలేదని, తెలుసుకుందామని కూడా అతను అనుకోవట్లేదన్నారు. అబద్ధాలు చెప్పటంలో చంద్రబాబును మించిపోయాడన్నారు. గ్రామాల్లో ఖాళీగా స్థలాలు ఉంటే యువకులు, విద్యార్థులు ఆడుకునేందుకు బాగుచేసి అవకాశం ఇస్తామన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తుంటే, టీడీపీ హయాంలో కేవలం 39 లక్షల మందికే ఇచ్చారన్నారు. తాము నూతనంగా 27లక్షల మందికి ఇచ్చామని, ఇప్పుడు 17లక్షల మందికి తీసేసారని ప్రచారం చేస్తున్నాడన్నారు. నిత్యం అబద్ధపు మాటలతో ప్రజల మనస్సులను గెలవటం కష్టమని, మళ్లీ హ్యాట్రిక్ కొట్టేది తానేనని పేర్కొన్నారు. సమావేశంలో రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ దిగేసీ.. ఫ్యాను కింద సేదదీరి..

వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలం తిమ్మాయపాలెం గ్రామం నుంచి 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పల్నాడు ప్రాంతాన్ని, వినుకొండ ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్ల గ్రామం నుంచి 50 కుటుంబాలు చేరిక...

వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు స్థానిక బొల్లా కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులుగా భావించి పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

మరో 130 కుటుంబాలు...

బొల్లాపల్లి : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపు శుభసూచకమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని అయ్యన్నపాలెం, మర్రిపాలెం, దోమలగుండం గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు. ఆయా గ్రామాల నుంచి 130 కుటుంబాలు పార్టీలో చేరారు. శనివారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ప్రభంజనం ఉందని, 2024 ఎన్నికల్లో కుప్పంతో సహా 175 స్థానాల్లో గెలుపుఖాయమన్నారు. ఈ నియోజకవర్గంలో జీవీ మళ్లీ ఇంటికే పరిమితమని, ఒత్తాసు పలుకుతున్న మక్కెన కాంగ్రెస్ గూటికి చేరుతారన్నారు. నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని, మండలంలో ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందని గుర్తు చేశారు. ఈ దఫా మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. జగనన్న సహాయ సహకారంతో వరికపూడిశెలకు ప్రాధాన్యత ఇస్తామని, ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి మండలంలో సాగు, తాగునీరు సమస్య లేకుండా చూస్తామన్నారు. గత ఐదేళ్లల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీలో ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





అయ్యన్నపాలెం, మర్రిపాలెం, దోమలగుండం గ్రామాల నుంచి పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

అన్నివర్గాలకు ఇంటి వద్దకే సంక్షేమం

–ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ (నూజెండ్ల): అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే ముఖ్యమంత్రి జగనన్న అందించారని నరసరావుపేట ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడులు గుర్తు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును వారు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం లభించిందని, ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందును స్వయంగా వడ్డించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకులు బొల్లా గిరిబాబు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీనీ సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం నేషనల్ క్వాలిటీ ఏష్యూరెన్స్ స్టాండెడ్స్ (ఎన్‌క్యూఏఎస్) అధికారుల బృందం రెండవ రోజు సందర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఢిల్లీ నుంచి బృందం వచ్చింది. ఈ బృందంలో డాక్టర్ వాసంతి, డాక్టర్ అనోజ్‌లు పాల్గొన్నారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బి. రవి పాల్గొని వైద్యశాల ద్వారా రోగులకు అందించే సేవలను వారికి వివరించారు. అలాగే ప్రస్తుత తరుణంలో వేసవి ఎండ తీవ్రతకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వైద్య సిబ్బందికి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాంప్రసాద్, స్థానిక వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సారథ్యంలోనే అందరికీ మేలు

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: రాష్ట్రానికి అన్ని విధాలుగా మేలు జరగాలంటే తిరిగి జగనన్న సీఎం కావాల్సిన చారిత్రక అవసరం ఉందని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడుతో కలసి మండలంలోని బొప్పూడి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్లు ఈ ఎన్నికల్లో ప్రజలు, పార్టీ కార్యకర్తలే స్టార్ క్యాంపైనర్లు అని వెల్లడించారు. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు వారి ఎల్లో మీడియా ధన బలంతో ఎన్నికల్లో గెలవాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. అదే చంద్రబాబు విషయానికి వస్తే 2014 ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికివదిలివేసి మరోసారి ప్రజలను మోసం చేయడానికి కొత్త హామీలతో ముందుకు వస్తున్నారని వారి మాటలు నమ్మ వద్దని కోరారు. ఆడిన మాటను తప్పే టీడీపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధమని పేర్కొన్నారు. మీకున్న రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అసెంబ్లీకి తనను, పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. తద్వారా జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా యాములయ్య, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చీమలమర్రి తిరునాళ్ల



నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ 34వ వార్షికోత్సవం పురస్కరించుకొని విశేషపూజలు చేశారు. అర్చకులు నారాయణం వెంకట నరసింహాచార్యులు, అజయ్‌స్కంద, శేషుబాబు, రామ్‌కిరణ్, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పండ్లు, వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అరటిపండ్ల గెలలతో ఆలయాన్ని అలంకరించడం స్వామివారి వైభవాన్ని చాటింది. స్వామివారి ఏకాహం నిర్వహించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని వెంకటపతి నగర్ వద్ద శుక్రవారం జరిగింది. ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పట్టణంలోని 23వ వార్డుకు చెందిన బాలకోటయ్య, రబ్బానీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు అవార్డు

సత్తెనపల్లి: విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి అభినందన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉత్తమ మహిళా ఉగాది అవార్డ్స్‌లో భాగంగా తెలుగు మహిళా అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. విబ్రాంత్ వాయిసెస్ డిజిటల్ స్టూడియో అధ్యక్షుడు నాదమునుల రామరావు, కోశాధికారి ఆర్.స్నేహారెడ్డి, ప్రముఖ గాయకుడు వెంపటి మూర్తి శ్రీరాములు, గాయకులు ఆర్.కె.ఫణి, కాళహస్తి రాజ్యలక్ష్మి, మిస్ ఉదయం సోషల్ వర్కర్ అభినందన చేతుల మీదుగా రమాదేవికి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. రమాదేవిని శనివారం పట్టణంలోని పలువురు సాహితీవేత్తలు, కళాకారులు అభినందించారు.

• కోడ్ ఉల్లంఘన



సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నా, ఇక్కడి అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. చిలకలూరిపేట-నరసరావుపేట వెళ్లే మార్గమధ్యంలో అప్పాపురం మలుపు వద్ద గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం ఉంది. ఈ శిలాఫలకంపై మాజీ మంత్రి ప్రస్తుత టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పేరు ఉంది. ఎన్నికల నియమావళి ప్రకారం శిలాఫలకం కనిపించకుండా పేపర్లు అంటించాల్సి ఉంది. అయితే అధికారులు పట్టించుకోకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–నాదెండ్ల

నిబంధనల మేరకు నిర్మాణమైతేనే పట్టణాభివృద్ధి

లైసెన్స్‌డ్ ఇంజినీర్లు సహకరించాలని కోరిన కమిషనర్



కమిషనరు రవిచంద్రారెడ్డిని సన్మానిస్తున్న లైసెన్స్‌డ్ ఇంజినీర్లు

నరసరావుపేట: పట్టణంలో నిబంధనల మేరకే భవన నిర్మాణం జరిగేలా మున్సిపల్ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు సహకారం అందజేయాలని కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ అతిథి గృహంలో పట్టణ మునిసిపల్ లైసెన్సుడ్ ఇంజినీర్లు, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రూల్స్ ప్రకారం భవన నిర్మాణాలు జరిగితే పట్టణ అభివృద్ధికి దోహదం కలుగుతుందన్నారు. లైసెన్స్‌డ్ ఇంజినీర్లు కమిషనర్‌ను దుశ్శాలువతో సత్కరించారు. టీపీవో ఎంవీ నరసింహారావు, టీపీఎస్ సత్యనారాయణ, పట్టణ ఇంజినీర్స్ సంఘం అధ్యక్షులు కొమ్మసాని కమలాకర రెడ్డి, గౌరవ అధ్యక్షులు జీపీ రంగయ్య, కోశాధికారి గంజి అనిల్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభించి తాగునీరు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మండు వేసవిలో ఉచిత మంచి నీటి కేంద్రాలు ఏర్పాటు కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమమని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వేసవి ఎండలను పురస్కరించుకొని పట్టణ నడిబొడ్డున శివుని ఐలాండ్ వద్ద పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన వారికి మజ్జిగ పాకెట్లు అందజేసి మాట్లాడారు. వేసవిలో బాటసార్ల దాహార్తిని తీర్చేందుకు మంచినీరు అందచేయటం చాలా మంచిపని అన్నారు. ఆర్యవైశ్య సోదరులు ఈ కార్యక్రమానికి ముందుకు రావటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. పట్టణ నడిబొడ్డున్న ఉన్న శివుడిబొమ్మ వద్ద నిత్యం అనేక మంది ప్రజలు వస్తూపోతూ ఉంటారని, వేసవికాలం ముగిసేంత వరకు ఈ మంచి నీటికేంద్రాలు కొనసాగించాలని సూచించారు. పట్టణ ప్రజలు అందరూ వీటిని వినియోగించుకోవాలని కోరారు. ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సోదరులకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, కేపీ రంగారావు, ఊర బాస్కరరావు, నిడమానూరి సురేంద్ర, గొడవర్తి కిషోర్, ప్రవల్లికా సత్యం, సాంబశివరావు పాల్గొన్నారు.



పొంగమంచుతో మూసుకుపోయిన రహదారులు

• శిశిరంలో మంచుపొరలు!



మంచుతో కప్పేసిన వరిపొలాలు

మరో నాలుగు రోజుల్లో వసంతకాలం ఆగమనం. అయినా ఆకాశంలో మంచు దుప్పట్లు వీడటం లేదు. శిశిరంలో చెట్ల ఆకులన్నీ రాలిపోయినా వసంతంలో మళ్లీ చిగురిస్తాయని చెబుతారు. అయితే ఉదయం 8 గంటలైనా వీడటం లేదు. ఇది ఒకింత ఆనందాన్ని మరి కొంత ఆవేదనను మిగుల్చుతోంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉక్కబోత, వడగాడ్పులతో సతమతమై మళ్లీ ఉదయం ఇలా మంచు దుప్పట్లు కప్పేస్తోంది. ఏప్రిల్ నెలలో ఇలా మంచు కురువడం దేనికి సంకేతమో అర్థంకాక జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

–ఈపూరు